నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
3 | మహబూబ్‌నగర్, గురువారం 3 అక్టోబర్ 2024 | NAGARKURNOOL

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ

మృతుడి భార్య లక్ష్మీదేవమ్మకు రూ.2 లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ఉండవెల్లి, అక్టోబర్ 2 : బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా.. కార్యకర్తలకు అండగా ఉంటుందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు భరోసా కల్పించారు. మండలంలోని మారమునగాల-1 గ్రామానికి చెందిన గొల్ల వెంకట్రాముడు నాలుగు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడికి బీఆర్ఎస్ పార్టీ రూ.2 లక్షల ప్రమాద బీమా ఉండటంతో కేటీఆర్ ఆదేశాల మేరకు బుధవారం చెక్కును మృతుడి భార్య లక్ష్మీదేవమ్మకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీశ్రేణులకు ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటామన్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రవిప్రకాశ్‌గౌడ్, పీఏసీసీఎస్ చైర్మన్ గజేంద ర్రెడ్డి, మాజీ సర్పంచ్ వీరన్న గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొని మహాత్ముడికి నివాళులర్పించారు.

గొర్రెపొట్టేలు @ రూ.58 వేలు

కర్ణాటక నుంచి కొనుగోలు చేసిన గొర్రె పొట్టేలు

నారాయణపేట, అక్టోబర్ 2 : నవరాత్రుల్లో భాగంగా అష్టమి రోజున అమ్మవారికి జంతుబలి ఇవ్వడం జిల్లాలో ఆచరంగా వస్తున్నది. ముఖ్యంగా జిల్లా కేంద్రంతోపాటు జాజాపూర్, కోటకొండ, దామరగిద్ద, ఊట్కూరు గ్రామాల్లో సోమ వంశీయ క్షత్రియ సమాజ్ కులస్తులు దసరాను అతి పెద్ద పండుగగా జరుపుకొంటారు.పండుగ సందర్భంగా ఇండ్లను శుభ్రం చేసి రంగులు వేస్తుంటారు. పూజ గదుల్లో తొమ్మిది రోజులపాటు అఖండ దీపం వెలిగిస్తుంటారు. అష్టమి రోజున రాత్రి అమ్మవారికి జంతుబలి ఇచ్చి.. మరునాడు బంధువులు, స్నేహితులను పిలిచి భోజనాలు పెడుతారు. ఇలా బలి ఇచ్చేందుకు తమదే పెద్ద గొర్రె, మేక ఉండాలని పోటీపడి కొనుగోలు చేస్తుంటారు. కొండగొర్రెలకు ప్రత్యేక పేరుగాంచిన కర్ణాటక రాష్ట్రంలోని అమీన్‌ఘడ్‌కు వెళ్లి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ధర పలికే గొర్రెను కొనుగులు చేస్తుంటారు. అలా ఈ ఏడాది సైతం నారాయణపేట పట్టణంలోని బురుడవాడి ధూల్‌పేటకు చెందిన కమలాపూర్ ప్రభాకర్ రూ.58 వేలు వెచ్చించి గొర్రె పొట్టేలును కొనుగోలు చేశారు. కొన్నేండ్ల నుంచి నారాయణపేటలో ప్రభాకర్ అత్యధిక ధరకు గొర్రెలను కొనుగోలు చేస్తూ వస్తున్నాడు. ఈ ఏడాది సైతం ఆయనదే పైచేయి నిలిచింది.

- వానకాలం సాగులో రైతన్నల కష్టాలు వర్ణనాతీతం
- ఇప్పటికీ రైతుభరోసా ఊసెత్తని సర్కారు
- ఆసాములు వద్ద అప్పు తెచ్చుకున్న అన్నదాతలు
- పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షాలు
- నీటిపాలైన వేల ఎకరాలు
- మార్కెట్లో వేరుశనగ, వరికి దక్కని మద్దతు ధర
- పెట్టుబడి మీద పడడంతో కర్షకుల ఆందోళన

వేరుశనగ పంట

సాగు కష్టాలు

గద్వాల, అక్టోబర్ 2 : జోగుళాంబ గద్వాల జిల్లాలో రైతన్నకు సాగు కష్టాలు తప్పడం లేదు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని వ్యవసాయంపై ఆశ చావక.. లాభం వచ్చినా.. నష్టం చవిచూసినా.. పంటలు పండిస్తూనే పనులు చేపడుతూనే ఉంటాడు. కేసీఆర్ సర్కారు చేదోడు వాదోడూ నిలవడంతో ఆసక్తి కనబరిచి సాగు చేపట్టారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతన్న ఇక్కట్లపాలవుతున్నాడు. సరైన విద్యుత్ సౌకర్యం లేదు.. రైతు భరోసా అందలేదు.. పంటల బీమా పథకం ఏర్పాటు చేసేందుకు రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేసినా.. అమలుకు నోచుకోకపోవడం, పంట నష్ట పరిహారం అందక పోవడంతో రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ కూడా ఇవ్వక పోవడంతో రైతులకు ఏమి చేయాలో తోచడం లేదు. దీనికితోడు భారీ వర్షాలు కురియడంతో పంట అంతా నేల పాలైంది. వేల ఎకరాల్లో నష్టం వచ్చింది.

గద్వాల మండలంలో వానకాలం సాగుచేసిన వరి

పెరిగిన సాగు ఖర్చులు..

ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. కానీ ఇందుకను గుణంగా ధరలు పెరగక పోవడంతో పెట్టుబడి కూడా చేతికి రావడం లేదు. కాలం కలిసి వస్తే తప్పా లాభాలు చూడడం లేదు. కేసీఆర్ సర్కారు హయాంలో పంట సీజన్ మొదలుకాగానే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ అయ్యేవి. దీంతో పెట్టుబడికి ఎలాంటి ఇబ్బందులేకుండా సాగు చేసేవారు. సేద్యం ఖర్చు, విత్తనాలు, ఎరువులు, కూలీలకు ఇలా ఏదో రకంగా ఉపయోగపడేవి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుభరోసా పేరిట రూ.7,500 ఇస్తామని చెప్పింది. కానీ, వానకాలం సీజన్ ముగుస్తున్నా ఇంతవరకు రూపాయి కూడా అందలేదు. దీంతో ఆసాముల వద్ద డబ్బులు వడ్డీలకు తెచ్చి సాగుచేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీనికితోడు పెరిగిన సాగు ఖర్చులతో రైతులు బెంబేలెత్తున్నారు.

రూ.16వేల అప్పు మిగిలింది..

ఎకరా పొలంలో వేరుశనగ విత్తనాల కోసం రూ.13వేలు ఖర్చు అయ్యింది. సాగు పనులకు రూ.10 వేలు, రసాయనిక ఎరువులు, మందులకు రూ.15 వేలు, గడ్డి మందులకు రూ.8 వేలు, వేరుశనగ కట్టె తీసి బుడ్డలు తెంపేందుకు రూ.20 వేలు వెచ్చించాను. ఎకరా కోసం సుమారు రూ.66 వేలు ఖర్చు అవుతున్నది. అయితే, ఎకరాకు 10 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ప్రస్తుతం బుడ్డలకు ధర లేక పోవడంతో క్వింటా రూ.5 వేలకు మించి ధర రావడం లేదు. పంట అమ్మగా రూ.50 వేలు వచ్చింది. ఈ క్రమంలో పెట్టుబడి రూ.66 వేలుకాగా.. వచ్చింది మాత్రం రూ.50 వేలే. దీంతో రూ. 16 వేలు అప్పుగా మిగిలింది. పంట మంచిగా పండి ఈ సారి అప్పులు తీరుతాయని అనుకున్న సమయం లో భారీ వర్షాలు వచ్చాయి. చేతికి వచ్చిన పంట దెబ్బతినడంతో అనుకున్న దిగుబడి రాలేదు. కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చేది. అప్పు లేకుండా పెట్టుబడి అక్కరకు వచ్చేది. వచ్చిన దిగుబడి డబ్బులు, రైతుబంధు కలిపితే అప్పు మిగిలేది కాదు. **– కురువ వెంకటేశ్, రైతు, అయిజ, జోగుళాంబ గద్వాల జిల్లా**

ఎకరాకూ రూ.50వేలపైనే పెట్టుబడి..

ఒకసారి కాకుంటే మరో ఏడాదైనా కాలం కలిసి రాదా అనే ఆశతో సాగుచేస్తున్నాను. కానీ ప్రతిసారీ ఏదో ఒక రూపంలో దెబ్బతింటూనే ఉన్నాం. ఎకరా వరి సాగు చేసేందుకు సుమారు రూ.58 వేల వరకు ఖర్చు అవుతున్నది. ఈ ఏడాది వర్షాలు మంచిగా కురిశాయి. పంట చేతికి వస్తే లాభాలు వస్తాయనుకున్న సమయంలో ప్రకృతి కన్నెర్ర చేసింది. భారీ వర్షాలు కురువడంతో పైరుకు దోమకాటు వచ్చింది. దీంతో దిగుబడి తగ్గిపోయింది. సోన వడ్లు నారు పోసేందుకు రూ.1,300, నాటుకోసం రూ.7 వేలు, ట్రాక్టర్లకు రూ.5 వేలు, మందు సంచులకు రూ.10వేలు, రసాయనిక ఎరువులకు రూ.9 వేలు, కలుపుతీతకు రూ.8,200, వరి పైరు కోసి మిషన్ పట్టడం వంటి తదితర వాటికి రూ.11,300 అయ్యింది. మొత్తం రూ.51,800 పెట్టుబడి అవుతుంది. ఎకరాలో 30 బస్తాలకు మించి దిగుబడి రాదు. బస్తా రూ.1,500 ధర పలికితే రూ.45 వేలు మాత్రమే వస్తుంది. దీంతో వచ్చిన డబ్బులు పోతే పెట్టుబడి అయిన ఖర్చే ఎక్కువ. అప్పు మాత్రమే మిగిలుతుంది. **– ఆంజనేయులు, రైతు, పులికల్, జోగుళాంబ గద్వాల జిల్లా**

'కాంగ్రెస్' కూలిపోవడం ఖాయం

వెల్దండ, అక్టోబర్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వానికి బడుగు, బలహీన వర్గాల ప్రజల శాపనార్థాలు, ఉసురు తగిలి కూలిపోవడం ఖాయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేశామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. ఆరు గ్యారెంటీలను గాలికి వదిలేశారన్నారు. హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చడానికి ఎవరు అధికారమిచ్చారని ప్రశ్నించారు. ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టకుండానే 300 రోజుల్లో రూ.80 వేల కోట్ల అప్పు ఎందుకు చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేశామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. ఆరు గ్యారెంటీలను గాలికి వదిలేశారన్నారు. హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చడానికి ఎవరు అధికారమిచ్చారని ప్రశ్నించారు. ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టకుండానే 300 రోజుల్లో రూ.80 వేల కోట్ల అప్పు ఎందుకు చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. శాంతి భద్రతలు అదుపుతప్పాయని, ఎక్కడ చూసినా హత్యలు, హత్యాచారాలు, దోపిడీలు జరుగుతున్నాయని ఆరోపించారు. రూ.25 వేల కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల చేపడితే.. మిగిలిన పనులను చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. వందల ఎకరాల ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్న బడాబాబులను వదిలేసి.. కూలీనాలీ చేసుకునే పేదల ఇండ్లు కూల్చి వారిని రోడ్డున పడేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కల్వకుర్తి కాటన్‌మిల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుతో కాంగ్రెస్ పతనం ప్రారంభమైందన్నారు. సీఎం సొంత జిల్లాలో ఆ పార్టీ ఓడిపోవడమే అందుకు నిదర్శనమన్నారు. అధికారం అడ్డుపెట్టుకొని ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా.. కార్మికులు బీఆర్ఎస్ పక్షాన నిలిచారని, సూర్య ప్రకాశ్‌రావు మూడోసారి విజయం సాధించడం హర్షణీయమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, యాదగిరి, అశోక్, ప్రసాద్, కొండ యాదవ్, లాలయ్య, రాజు, శ్రీను, రవి, హన్మంతనాయక్, పత్యానాయక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- ఇండ్లు కూల గొట్టేందుకు ఎవరు అధికారమిచ్చారు?
- రూ.80 వేల కోట్ల అప్పు ఎందుకు చేశారు
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయం

నేటి నుంచి దక్షిణకాశీలో ఉత్సవాలు ప్రారంభం

జగజ్జననీ.. జోగుళాంబ

జోగుళాంబ దేవి

- కోటిలింగాల క్షేత్రం అలంపురం
- శరన్నవరాత్రులకు ఏర్పాట్లు
- 9న కల్యాణం..12న తెప్పోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

అలంపూర్, అక్టోబర్ 2 : కోటి లింగాలు కొలువై దక్షిణ కాశీగా పేరుగాంచిన అలంపురం క్షేత్రం రాష్ట్రంలోనే ఏకైక శక్తి పీఠంగా విరాజిల్లుతున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో (శ్రీశైలం, పిఠాపురం, ద్రాక్షారామం, అలంపురం) నాలుగు శక్తి పీఠాలుండగా విభజన అనంతరం అలంపురం జోగుళాంబ ఏకైక శక్తిపీఠంగా తెలంగాణలో ప్రసిద్ధికెక్కింది. రాజధానికి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో, గద్వాల జిల్లా కేంద్రానికి 60 కిలోమీటర్లు, కర్నూలుకు 30 కిలోమీటర్ల దూరంలో, తుంగభద్రా నది తీరంలో అలంపూర్ పుణ్య క్షేత్రం వెలిసింది. క్షేత్రాన్ని దర్శించుకునేందుకు రోడ్డు మార్గం తోపాటు రైలుమార్గం కూడా ఉంది. ఈ క్షేత్రంలో జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలతోపాటు నవబ్రహ్మ ఆలయాలు దర్శన మిస్తాయి. కోటి లింగాలు కొలువైన క్షేత్రంలో లేని దేవతామూర్తులుంటూ లేడు. రేణుకాదేవీ భక్తులకు సంతానలక్ష్మిగా దర్శన మిస్తుంది. ఇక్కడ కంచి కామాక్షి ఆలయం కూడా ఉన్నది. శతాబ్దాల చరిత్ర గల మ్యూజియంలోని శిల్ప సంపదను తిలకించడానికి విదేశాల నుంచి సైతం యాత్రికులు వస్తుంటారు. దక్షిణ కాశిగా, భాస్కర.. పర శుభామ క్షేత్రంగా విరాజిల్లుతున్నది. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కృష్ణ, తుంగభద్ర నదుల సంగమం వద్ద ముంపునకు గురైన సంగమేశ్వరాల యాన్ని యథాతథంగా అవే రాళ్లతో.. అదే ఆకారం, అదే నమూనాతో ఆలయాన్ని పునః నిర్మించడం చరిత్రలో ఎక్కడా లేదు.

నవ బ్రహ్మ ఆలయాలు

శైవ క్షేత్రాలకు తలమానికంగా శ్రీశైలం క్షేత్రానికి పశ్చిమ ద్వారంలో అలంపూర్, ఉత్తర ద్వారంలో ఉమామహేశ్వరం, తూర్పున త్రిపురాంతకం, పడమరన సిద్ధవటం క్షేత్రాలు వెలిశాయి. సుమారు 1400 సంవత్సరాల కిందట బాదామి చాళుక్యుల కాలంలో రెండో అలంపూరంలో ఆలయాలను నిర్మించబట్టు శిలా శాసనాల ద్వారా తెలుస్తున్నది. క్షేత్రంలో ప్రధాన ఆలయ వైభవ బాలబ్రహ్మతో పాటు కుమారబ్రహ్మ, ఆర్క బ్రహ్మ, వీర బ్రహ్మ, తారక బ్రహ్మ, విశ్వ బ్రహ్మ, గరుడ బ్రహ్మ, పద్మ బ్రహ్మ, స్వర్గ బ్రహ్మ వంటి నవ బ్రహ్మాలయాలు కూడా నిర్మితమయ్యాయి. ఈ ఆలయాల మీద అలనాటి సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా నాటి అష్టదిక్పాలకులు, శివ, విష్ణు అవతారాలు, నటరాజు, పురాణ గాథలు తెలిపే శిల్ప సంపద, మరెన్నో శిల్పాలు ముగ్ధమనోహరంగా మలచబడ్డాయి. పంచతంత్ర, కావ్య కథా చిత్రాలు, ఆదిత్య హృదయం, రామాయణ, మహాభారత గాథలు తెలియజేసే ఎన్నో శిల్పాలు యాత్రికులకు కనువిందు చేస్తున్నాయి. మరి కొన్ని శిల్పాలు మ్యూజియంలో భద్రపర్చారు.

పాపనాశిని ఆలయాలు..

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయానికు దక్షిణ దిశలో కొంత దూరంలో 24 ఆలయాల సముదాయం (పాపనాశి ఆలయాలు) ఉన్నది. ఈ ఆలయాలు ద్రావిడ సాంప్రదాయానికి చెందినవిగా గుర్తించారు. ఆలయ స్తంభాలపై రామాయణ, మహాభారత, క్షీరసాగర మథనం గాథలు తెలియజేసే అపురూప శిల్పకళా చిత్రాలు ఇక్కడ దర్శన మిస్తాయి. 24 ఆలయాల్లోనూ భిన్న వైభవ శివ లింగాలు, ప్రధాన ఆలయంలో ఆకుపచ్చ రంగులో శివ లింగం దర్శన మిస్తుంది.

రసాత్మక లింగం - గోస్పాద ముద్రికం

ప్రపంచంలో ఏ క్షేత్రంలో లేనివిధంగా ఇక్కడ ప్రత్యేక ఆకారంలో రసలింగం ఉన్నది. పూర్వం ఈ లింగం నుంచి కొన్ని ప్రత్యేక వైభవ రసాలు వెలువడుతుండేవి కాబట్టి దానికి రసలింగం అని, బ్రహ్మ తపస్సు చేస్తే పరమేశ్వరుడు ఉద్భవించాడు కాబట్టి బ్రహ్మేశ్వరుడని, ఆకారం చిన్నగా ఉన్నందునా బాలబ్రహ్మేశ్వరుడని పలు పేర్లు వాడుకలో ఉన్నాయి. గోమాత నేలపై పాదం మోపినప్పుడు ఎలాంటి నమూనా ఏర్పడుతుందో ఆ విధంగా (ఆవు గెట్టె పైభాగం ఆకారంలో)పై భాగం చీలిపోయినట్లు ఉంటుంది. శివలింగం నుంచి వెలువడుతున్న విషయాన్ని గమనించిన కొందరు రససిద్ధులు పరశవేది అనే మూలిక సహాయంతో బంగారాన్ని చేసే వారని, అదే బంగారంతో ప్రధాన ఆలయాలు చుట్టూ మరో ఎనిమిది ఆలయాలను నిర్మించినట్టు చరిత్ర చెబుతున్నది. అవే నవబ్రహ్మ ఆలయాలు.

ఉత్సవాలు ఇలా..

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ఈవో పురేందర్‌కుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది అన్ని రకాలు చర్యలు చేపట్టారు. 3వ తేదీ గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. నవరాత్రుల్లో అమ్మవారు ఒక్కోరోజు ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తుంది. ఉత్సవాల్లో పాల్గొనడానికి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సాయంత్రం ధ్వజారోహణం, 9వ తేదీ మూల నక్షత్రాన జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి కల్యాణోత్సవం, 10న దుర్గాష్టమి పూజలు, అనంతరం జోగుళాంబ అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తారు. 11వ తేదీన మహార్ణవమి రోజున కాళరాత్రి పూజలు, వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు భూదేవీ శ్రీదేవీ సహిత వేంకటశ్వరస్వామి కల్యాణోత్సవం కూడా నిర్వహించనున్నారు. 12వ తేదీ శనివారం దశమి రోజున విజయదశమి పూజలు, ఉదయం శేషవాహన సేవ. చివరిరోజు పూర్ణాహుతి, అవభృత స్నానం, సాయంత్రం 4 గంటలకు శమీ పూజ, సంధ్యా సమయంలో నదీ హారతి అనంతరం తుంగభద్ర నదిలో జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరుల స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు నదీ విహారంలో భాగంగా తెప్పోత్సవం నిర్వహిస్తారు. అనంతరం ధ్వజావరోహణంతో ఉత్సవాలకు పరిసమాప్తి పలుకనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

సర్వేకు సమయమాయే..

- నేటి నుంచి డిజిటల్ కార్డుల సర్వే
- 7వ తేదీ వరకు వివరాల సేకరణ
- ఇంటింటికీ వెళ్లనున్న ప్రత్యేక బృందం
- పైలట్ ప్రాజెక్టు కింద గ్రామాలు, వార్డుల ఎంపిక

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబర్ 2 : ప్రతి కుటుంబానికి ప్రత్యేకంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్, ఆరోగ్యం, సంక్షేమ పథకాలన్నిటికీ ఉపయోగపడేలా కార్డులను రూపొందించి.. లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. ఒక రాష్ట్రం.. ఒకే డిజిటల్ కార్డు (వన్ స్టేట్.. వన్ డిజిటల్ కార్డ్) విధానంతో ముందుకెళ్లాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక బృందాలతో కుటుంబ వివరాలు సేకరణకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది.

అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ఇలా

కుటుంబ డిజిటల్ కార్డులో మహిళనే ఇంటి యజమానిగా గుర్తించడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు సిద్ధం చేయనున్నారు. వీటితో లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్, ఆరోగ్య సేవలు పొందేలా ఈ కార్డులో ప్రతి కుటుంబ సభ్యుడి హెల్త్ ప్రొఫైల్ (ఆరోగ్య సమాచారం) ఉండనున్నది. ఆయా కుటుంబాల్లో కొత్త సభ్యుల చేరిక, తొలగింపునకు సంబంధించి ఎప్పటికప్పుడు కార్డును అప్‌డేట్ చేసుకునేలా చర్యలు చేపట్టనున్నారు.

పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు

మహబూబ్‌నగర్ నియోజకవర్గం పర్యవేక్షక అధికారిగా మహబూబ్‌నగర్ ఆర్డీవో, జడ్చర్ల నియోజకవర్గానికి జెడ్పీ సీఈవో, దేవరకద్ర నియోజకవర్గానికి భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టరును నియమించారు. టీమ్ లీడర్లుగా తాసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వ్యవహరిస్తారు. సభ్యులుగా పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందిని నియమించారు. ప్రతి నియోజకవర్గంలో గ్రామానికి రెండు బందాలు, మున్సిపాలిటీలో 4-6 బృందాలు ఉంటాయి. ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, ఆర్పీలు, అంగన్‌వాడీ కార్యకర్తల సహకారం తీసుకోనున్నారు.

పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక

డిజిటల్ కార్డుల జారీ కోసం పైలట్ ప్రాజెక్టు కింద గ్రామాలు, వార్డులను ఎంపిక చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం మాధారం, మహబూబ్‌నగర్ 37వ వార్డు, జడ్చర్ల మండలం అల్వాన్‌పల్లి, జడ్చర్లలోని 24వ వార్డు, సీసీకుంట మండలం సీతారాంపేట, భూత్పూరులోని 9వ వార్డు ఎంపికైంది.

ప్రజలు అందుబాటులో ఉండాలి

టీమ్ లీడర్లు, సభ్యులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామం, వార్డుల్లోని కుటుంబాల వివరాలు సేకరించనున్నారు. ప్రజలు అందుబాటులో ఉండి తమ కుటుంబ వివరాలు నమోదు చేసుకోవాలి. కుటుంబ సమగ్ర వివరాల తోపాటుఫొటో విధిగా ఉండేలా సర్వే బృందాలు జాగ్రత్తలు తీసుకోవాలి.

–విజయేందిరబోయి, కలెక్టర్, మహబూబ్‌నగర్